క్లుప్తంగా

రైతులను ఆదుకుంటాం

ఎంపీ బాలశౌరి

చిలకలపూడి(మచిలీపట్నం): బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులను ఆదుకునేందుకు అవసరమైతే తాను ప్రధాని నరేంద్రమోదీని కలిసి పరిస్థితిని వివరించి కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆయన కోరారు. పునరావాస కేంద్రాల్లో మంచి ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు.

ఏఎస్పీ పర్యటన

నాగాయలంక: మండలంలోని ఎదురుమొండి దీవిలో మంగళవారం కృష్ణా జిల్లా అదనపు ఎస్పీ శ్రీహరిబాబు పర్యటించి మిచాంగ్ తుపాను పరిస్థితులను పరిశీలించారు. ఎదురుమొండి, జింకపాలెం, ఏసుపురం, కృష్ణాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన తుపాను బాధితుల పునరావాస కేంద్రాలను సందర్శించి వసతులపై ఆరా తీశారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదని, పోలీసులు మీకు రక్షణగా ఉంటారన్నారు. అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్, సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అంతిమ సంస్కారానికి అవస్థలు



కృత్తివెన్ను: తుపాను ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అంతిమ సంస్కారానికి మృతురాలి బంధువులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం మండల పరిధిలోని గాంధీనగరంలో వృద్ధురాలు జన్యావుల పల్లాలమ్మ (80) మృతిచెందింది. వర్షం కురుస్తుండటంతో ఆమె దహన సంస్కారాలకు కుటుంబ సభ్యులు, బంధువులు ఇబ్బందులకు గురయ్యారు. వర్షానికి చివరికి టార్పాలిన్‌ను అడ్డుగా పెట్టుకుని దహన సంస్కారాలు పూర్తిచేశారు.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌కు పితృ వియోగం

కృత్తివెన్ను: వైఎస్సార్ సీపీ నాయకుడు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పిన్నెంటి మహేష్ తండ్రి పి. సీతారామస్వామి (83) సోమవారం రాత్రి మృతిచెందారు. చినబాబు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ సభ్యుడిగా, కృత్తివెన్ను పీఏసీఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన భౌతిక కాయాన్ని జోగి రాజీవ్, పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు.

విద్యుత్ సమస్యలపై స్పందన

మచిలీపట్నంటౌన్: తుపాను తాకిడికి విద్యుత్ సరఫరాకు అక్కడక్కడా అంతరాయం ఏర్పడినా విద్యుత్ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. దెబ్బతిన్న పోల్స్‌ను, లైన్లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి ప్రజలకు విద్యుత్ సమస్య లేకుండా చూశారు. మచిలీపట్నం ఎలక్ట్రికల్ డివిజన్ పరిధిలోని 12 మండలాల్లో 50కి పైగా విద్యుత్ స్తంభాలు కూలాయి. వీటిని గంటల వ్యవధిలోనే పునరుద్ధరించి ఆయా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేశారు. మంగళవారం రాత్రి అధికారులు, సిబ్బంది కార్యాలయాల్లోనే ఉండి పర్యవేక్షిస్తున్నారు.

అతలాకుతలం

- భారీ వర్షాలకు నీటి పాలైన పంటలు
- వరి, వేరుశనగ, మినుము రైతుల ఆవేదన
- కూలిన చెట్లు..పడిపోయిన విద్యుత్ స్తంభాలు
- అప్రమత్తమైన అధికారులు
- యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు



బసవానిపాలెం పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి



బందరు సుందరయ్య నగర్‌లో నిలిచిన వర్షం నీరు



పెడనలో పడిపోయిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

పెడన: మిచాంగ్ తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రైతులు పంటలను నష్టపోగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆరుగాలం పండించిన పంట చేతికి అందకుండా పోతుందనే ఆవేదనతో రైతులు తల్లడిల్లుతున్నారు. పెడన నియోజకవర్గ వ్యాప్తంగా 36,597 ఎకరాల్లో వరి పంట కోత కోయకుండా ఉంది. ఈ పంట నేల వారి ముంపుబారిన పడింది. సుమారు 1,275 ఎకరాల్లో కోత కోసి పంటను ఇంటికి తరలించే సమయంలో వర్షాలు ప్రారంభం కావడంతో పనలు ముంపులోనే ఉన్నాయి. కొన్నిచోట్ల ఇప్పటికే వరి పంట కోసి మినుము వేయగా ఇప్పుడిప్పుడే మొలకదశలో ఉంది. ఇలా వేసిన మినుము కూడా ముంపు బారిన పడింది. సుమారు మూడు వేల ఎకరాలకుపైగా మినుము పంట దెబ్బ తిని ఉంటుందని ప్రాథమిక అంచనా. వేరుశనగ సుమారు 150 నుంచి 200 ఎకరాల వరకు ముంపు బారిన పడి ఉండవచ్చునని సంబంధిత శాఖాధికారుల నివేదికలు పేర్కొంటున్నాయి.

చేనేత మగ్గాల్లోకి నీరు..

పెడన పట్టణంలో అధిక వర్షాలకు చేనేత పనులు స్తంభించాయి. చెమ్మ దనానికి మగ్గం కదలని దుస్థితి. మగ్గం గుంతల్లోకి వర్షం నీటి ఊట రావడంతో నేత కార్మికులు మగ్గంలోకి అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. పెడన పట్టణంతోపాటు నియోజకవర్గంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాలు తటాకాలను తలపిస్తున్నాయి. రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం..

తుపాను ప్రభావంతో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్‌స్తంభాలు నేలకు ఒరిగాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పెడన, గూడూరు, కృత్తివెన్ను మండలాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌సంభాలు పడిపోయాయి. పెడన పట్టణంలోని 15వ వార్డు, కృత్తివెన్ను మండలంలోని పాశ్వాపురం, చందాలలో విద్యుత్ స్తంభాలు పడిపోగా విద్యుత్ శాఖాధికారులు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. పెడన పట్టణంలోని జగతి థియేటర్ రోడ్డులో భారీ వృక్షం పడిపోవడంతో మున్సిపల్ అధికారులు వెంటనే చెట్టు కొమ్మలను తొలగించారు.

11వేల ఎకరాల్లో ముంపులో వరి పంట

గూడూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు రైతులను ముంచాయి. సోమవారం తెల్లవారుఝాము నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాల్లో నీరు కిందకు పారకపోవడంతో పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. గూడూరు మండలంలో సుమారు 11,500 ఎకరాల్లో పంట ముంపు బారిన పడినట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక అంచనా రూపొందించారు. తుపాను తీరం దాటినప్పటికీ వర్షాలు కురుస్తుండటంతో ముంపు బారి నుంచి పంటలు బయట పడటానికి సమయం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎటు చూసినా నీరే..

గూడూరు మండలంలో 18 వేల ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిసాగు చేపట్టారు. దానిలో ఇప్పటి వరకు 5 వేల ఎకరాల్లో మాత్రమే పంట కోతలు, నూర్పిళ్లు పూర్తయి ధాన్యం సురక్షితంగా మిల్లులకు చేరింది. మిగిలిన 13 వేల ఎకరాల్లో పంట ఇంకా పొలాల్లోనే వివిధ దశల్లో ఉంది. మండలంలోని 25 గ్రామాల్లో సుమారు 11 వేల ఎకరాల్లో పంట కోతకు సిద్ధంగా ఉండగా, 500 ఎకరాల్లో పంట కోసి పనల దశలో ఉంది. ఇలాంటి తరుణంలో కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరింది. మోకాలి లోతులో నీరు నిలిచిపోవడంతో నేలకొరిగిన పంటతో పాటుగా పనల దశలో ఉన్న పంట కూడా నీటిలో తేలియాడుతోంది.

పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న ఇళ్లు..

తుపాను ప్రభావంతో వీస్తున్న గాలులకు మండలంలోని పోసినవారిపాలెం, ఆకులమన్నాడు ప్రాంతాల్లో ఇళ్లకు నష్టం వాటిల్లింది. పోసినవారిపాలెంలో రెండు ఇళ్లు పూర్తిగా, 4 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆకులమన్నాడులో ఒక ఇల్లు పూర్తిగా, 3 ఇళ్లకు పాక్షికంగా నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. నష్టం వాటిల్లిన ఇళ్లను తహసీల్దార్ బి.విజయప్రసాద్ ఆయా గ్రామాల వీఆర్వోలతో కలిసి పరిశీలించారు.

తెగిపోయిన విద్యుత్ తీగలు

తుపాను ప్రభావంతో వీస్తున్న గాలులకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది. గాలులకు ముక్కొల్లు, నారికేడాలపాలెం గ్రామాల్లో రెండు స్తంబాలు కూలిపోయాయి. దీనికితోడు పలు గ్రామాల్లో చెట్లు కూలి విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో సోమవారం రాత్రి నుంచి మండలంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి మంగళవారం సాయంత్రానికి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ముంచిన మిచాంగ్

కోనేరుసెంటర్: మిచాంగ్ తుపాను మండల రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. బందరు మండలంలో 16,525 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేయగా ఇప్పటి వరకు సుమారు 1,910 ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తయ్యాయి. కొందరు రైతులు ధాన్యాన్ని విక్రయించుకోగా మరి కొందరు తుపాను హెచ్చరికలతో కోసిన ధాన్యాన్ని బస్తాల్లోకి ఎక్కించి అధికారుల ఆదేశాల మేరకు అప్పటికప్పుడు మిల్లులకు తరలించారు. కోతలు పూర్తి చేసుకోని మిగిలిన 14,615 ఎకరాల్లో పొలాలు మిచాంగ్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నీట మునిగిందిది.

పూర్తిగా దెబ్బతిన్న వేరుశనగ

మండలంలో ఈ ఏడాది 1,600 ఎకరాల్లో వేరుశనగ వేయగా తుపాను కారణంగా 1,600 ఎకరాల్లోని వేరుశనగ పంట నీట మునిగింది. వేరుశనగ రైతులకు తీరని నష్టం ఏర్పడింది. మండలంలో నీటమునిగిన వరి, వేరుశనగ పొలాలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి డి. హారిక పరిశీలించారు.

వాణిజ్య పంటలకు నష్టం..

మోపిదేవి: తుపాన్ ప్రభావంతో పలు రకాల వాణిజ్య పంటలతో పాటు వరి పొలాలకు నష్టం వాటిల్లింది. మండలంలోని పెదకళ్లేపల్లిలో వరి పొలాలు నీట మునగగా, కోసూరువారిపాలెం, మేళ్లమర్తింకలో పలు రకాల కూరగాయ పంట పొలాల్లోకి వర్షం నీరు చేరింది. పెదప్రోలు చైతన్య నగర్‌లో కైలా అనసూయకు చెందిన పూరి పాక నేలకొరిగి పాక్షికంగా దెబ్బతింది. కొక్కిలిగడ్డ రహదారిలో కుప్పల చుట్టూ నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు గ్రామాల్లో ప్రజలకు సూచనలు చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు..

కృత్తివెన్ను: మిచాంగ్ తుపాను ప్రభావం మండలంపై తీవ్రంగా ఉంది. మంగళవారం ఉదయం నుండి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో వరిపంట నేలవాలింది. కోతలు కోసిన చేలల్లోనూ, వేరుశనగ, మినుము చేలల్లోకి భారీగా వర్షం నీరు చేరడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. భారీగా కురిసిన వర్షంతో పాటు, సముద్రపు నీరుసైతం ముందుకు చొచ్చుకురావడంతో తీర గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 500 ఎకరాలలో వరి, 119 ఎకరాలలో వేరుశనగ, రెండువేల పై చిలుకు ఎకరాలలో మినుము పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు అధికారుల ప్రాథమిక అంచనాలు పేర్కొంటున్నాయి. తుపాను తీవ్రత నేపథ్యంలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం కలుగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది. మండలంలో ఐదు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తీర గ్రామాల ప్రజలను అందులో సురక్షితంగా ఉంచింది. వారికి అల్పాహారం, భోజన సదుపాయాలను కల్పించారు.

- **బంటుమిల్లి:** మండలంలో తుపాను ప్రభావానికి నోటిదాక వచ్చిన వరి పంట నీట మునగడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం దాదాపు 225 మిల్లీమీటర్ల నమోదైంది. భారీ వర్షాలకు అంతర్గత డ్రెయిన్ పనిచేయక బంటుమిల్లి-మచిలీపట్నం జాతీయ రహదారి పంట కాలువను తలపించింది. స్థానిక బీసీకాలనీ చుట్టూ నీరు చేరడంతో విష పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని కాలనీ వాసులు భయపడుతున్నారు. తుపాను గాలికి గుడివాడ రోడ్డులో చెట్లు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. నాలుగు పునరావాస కేంద్రాల్లో 169 మందికి ఆవాసం కల్పించామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. పెందురు కేంద్రంలో బాధితులకు ప్రముఖ ఆక్వా వ్యాపారి ఎల్. నాగేశ్వరరావు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.



బందరు మండలం పొట్లపాలెంలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఏఓ హారిక



పెదకళ్లేపల్లిలో వరి పనలపైకి చేరిన వర్షం నీరు



మేళ్లమర్తిలంకలో మిర్చి తోటలోకి చేరిన వర్షం నీరు



నిడమర్రు వద్ద వర్షం నీటిలో వేరుశనగ

పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే సింహాద్రి

మోపిదేవి/నాగాయలంక/కోడూరు: మోపిదేవి మండలంలో ఏర్పాటు చేసిన రెండు పునరావాస కేంద్రాలను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, మచిలీపట్నం డీఎల్‌పీఓ జ్యోతిర్మయి వేర్వేరుగా మంగళవారం సాయంత్రం సందర్శించారు. బాధితులను కలిసి వారికి అందుతున్న భోజన, వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, తగిన మందులు కూడా అందుబాటులో ఉంచుకోవాలని వైద్యసిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ లేకుండా డ్రెయినేజీలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. నాగాయలంక, కోడూరు మండలాల్లోని పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సందర్శించారు. బాధితులతో మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- రాష్ట్ర మంత్రి జోగి రమేష్
- ముంపు ప్రాంతాల పరిశీలన
- నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



కమలాపురంలో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: నష్టపోయిన ప్రతి రైతును అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మిచాంగ్ తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెడన నియోజకవర్గంలోని ముంపునకు గురైన పంట పొలాలను, పెడన పట్టణంలోని ముంపు ప్రాంతాలను మంగళవారం మంత్రి జోగి రమేష్ పరిశీలించారు. గూడూరు మండలం గూడూరు, తుమ్మలపాలెం, పెడన మండలం గురివిందగుంట, కమలాపురం, చేవెంద్రపాలెం, చెన్నూరు బంటుమిల్లి మండలం కంచడం, బర్రిపాడు గ్రామాల పరిసరాల్లోని ముంపు బారిన పడిన పంట పొలాలను పరిశీలించి రైతులతో, అధికారులతో మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే జిల్లా అధికారులను అప్రమత్తం చేశారని, పంట నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. పంటల బీమా ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఎవరికైనా ఏమైనా ఇబ్బంది వస్తే తనను నేరుగా సంప్రదించవచ్చని లేదా కార్యాలయంలో సమాచారం ఇచ్చినా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. పెడన పట్టణంలో ముంపు బారిన పడిన 21, 22 వార్డులలో మంత్రి పర్యటించారు. చేనేత మగ్గాల గుంతల్లోకి నీరు వెళ్లి నేత నేయడానికి వీలు లేకుండా పోయిందని పలువురు నేత కార్మికులు మంత్రి దృష్టికి తీసుకురాగా తక్షణం మంత్రి స్పందిస్తూ చేనేత, జౌళి శాఖ అధికారులను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలను పరిశీలించిన మంత్రి

గూడూరు: గూడూరు మండలం తుమ్మలపాలెం గ్రామంలో నీటమునిగిన పంటను మంత్రి జోగి రమేష్ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు నీటి ముంపుకు గురైన పంటను మంత్రి జోగి రమేష్‌కు చూపించి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి మాట్లాడుతూ వర్షాలకు తడిచిన, పాడైన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. పంట నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేసి రైతులకు పరిహారం అందించేందుకు ముఖ్యమంత్రి అధికారులను సమాయత్తం చేస్తున్నారని వివరించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్ణం పెదబాబు, నాయకులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో సకల సౌకర్యాలు



బాధితులకు భోజనం అందిస్తున్న అధికారులు

కోడూరు: కోడూరు మండలంలోని బసవానిపాలెం, ఊటగుండం, రామకృష్ణాపురం, పాలకాయతిప్ప, ఉల్లిపాలెం గ్రామాల నుంచి 600 మంది ప్రజలను పునరావాసం నిమిత్తం స్వతంత్రపురం జెడ్పీ పాఠశాలకు తరలించారు. బాధితులకు అవసరమైన అన్ని వసతులను అధికారులు సమకూర్చారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన వసతిని ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించారు. వీరికి రెండు సార్లు పాలు, గుడ్లను అందించారు. దోమల నివారణకు అవసరమైన జెట్‌కాయిల్స్, ఆల్‌అవుట్‌ను అధికారులు సమకూర్చారు. బాధితుల కోసం పాఠశాల వద్దే ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గర్భిణుల ఆరోగ్యాన్ని వైద్యులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా పంచాయతీ కార్మికులు శానిటేషన్ పనులు నిర్వహించారు. తుపాను ప్రభావం తొలగే వరకు పునరావాస కేంద్రం కొనసాగుతుందని ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్. రాజేంద్రప్రసాద్, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ సుభాషిణి, సచివాలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిండుకుండలా రత్నకోడు డ్రెయిన్

- పైకి ఎగతట్టిన సముద్రం నీరు
- దిగువకు పారని మురుగు



జరుగువానిపాలెం వద్ద నిండుకుండలా మారిన రత్నకోడు డ్రెయిన్

కోడూరు: దివిసీమలోని వరి పొలాల్లో మురుగు పోయేందుకు దోహదపడే రత్నకోడు (తాలేరు) డ్రెయిన్ నిండుకుండలా మారింది. తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పాటు సముద్ర నీరు పైకి ఎగతట్టడంతో డ్రెయిన్ ఉప్పొంగి ప్రవహిస్తోంది. డ్రెయిన్ నిండుకుండలా మారడంతో వరి పొలాల్లో మురుగు దిగువకు పారే పరిస్థితి లేకుండా పోయింది. వర్షం నీరు వరిపొలాల్లో ఉండిపోగా, మందపాకల, లింగారెడ్డిపాలెం, చినగుడుమోటు, జరుగువానిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట ప్రాంతాల్లో డ్రెయిన్‌లో నీరు కూడా పొలాల్లోకి ప్రవహిస్తోంది. ఇప్పటికే పొలాల్లో నీరు తిష్ట వేయగా, డ్రెయిన్ నీరు ఎగతట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డ్రెయిన్‌పై కొంతమంది అక్రమ వల్లకట్లదారులు రొయ్యల కోసం వలకట్లు ఏర్పాటు చేయగా, ఈ వలకట్లు కూడా నీరు దిగువకు వెళ్లేందుకు అడ్డుగా మారాయని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వలకట్లను తొలగించాలని కోరుతున్నారు.

రహదారులు జలమయం

అవనిగడ్డ: దివిసీమలో కుండపోత వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయ మయ్యాయి. భారీ వర్షాలకు అవనిగడ్డ ప్రధాన రహదారి నీటమునిగింది. అవనిగడ్డ డిగ్రీ కళాశాల క్రీడా మైదానం చెరువుని తలపిస్తోంది. మంగళవారం అవనిగడ్డలో 68.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా, నాగాయలంకలో 56.7, కోడూరులో 52.1, మోపిదేవిలో 46.2, చల్లపల్లిలో 45.4, ఘంటసాలలో 43.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

తుపాను బాధితులకు దుప్పట్లు, చీరలు పంపిణీ



తుపాను బాధితులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మోపిదేవి: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ముందస్తుగా పల్లపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని మోపిదేవి వార్పు వద్ద గురుకుల పాఠశాల, కె. కొత్తపాలెం జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. రెండు కేంద్రాల్లో 60 మందికి పైగా బాధితులకు భోజనం, తాగునీరు, మందులతో పాటు దుప్పట్లు అందచేశామని చెప్పారు.

బాధితులకు వైఎస్సార్ సీపీ నేతల చేయూత..

అధిష్ఠానం ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ మండల నాయకులు తుపాను బాధితులకు సాయం చేశారు. మోపిదేవి వార్పు వద్ద గురుకుల పాఠశాలలోని బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బాధితులకు భోజనాలు వడ్డించి మందులు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి గోవిందు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, లింగం జగదీష్‌కుమార్, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, బండారు సూరిబాబు, గరికిపాటి వెంకటేశ్వరరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎడ్లంకలో కోతకు గురైన కాజ్‌వే

యుద్ధప్రాతిపదికన గండి పూడ్చివేత



ఎడ్లంకలో రహదారికి పడిన గండిని పూడ్చిస్తున్న అధికారులు

అవనిగడ్డ: మిచాంగ్ తుపాను ప్రభావంతో నియోజకవర్గంలో ఎడతెరిపిలేని వర్షాలకు వరిపంట నేలవారింది. పనలపై ఉన్న వరిపంట నీటమునిగింది. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పలు మండలాల్లో పర్యటించి పునరావాసా కేంద్రాలను సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పారు. అడిషనల్ ఎస్పీ శ్రీహరిబాబు నాగాయలంక మండలంలోని పర్యటించారు. మొవ్వ-కొడాలి మధ్య కొన్నిచోట్ల భారీ వృక్షాలు పడిపోగా యుద్ధప్రాతిపదికన తొలగించి ట్రాఫిక్‌ని పునరుద్ధించారు.

అవనిగడ్డ మండలం పాత ఎడ్లంకకు వెళ్లే రహదారికి గండి పడటంతో అధికారులు వెంటనే పూడ్చివేశారు. ఘంటసాల మండలంలో మొవ్వ- కొడాలి మధ్య భారీ వృక్షాలు ప్రధాన రహదారిపై పడటంతో తొలగించి రాకపోకలను పునరుద్ధించారు. కోడూరు, నాగాయలంక, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో పలుచోట్ల విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడటం, కొబ్బరిమట్టలు పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం కలిగింది. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ పి జాషువాతో కలిసి ఎమ్మెల్యే నాగాయలంక మండలంలోని ఏటిమొగ ప్రాంతంలో పర్యటించారు.

బందరు నగరం జలమయం

- స్తంభించిన జన జీవనం
- కొనసాగుతున్న పునరావాస కేంద్రాలు



బందరు ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న మేయర్, డెప్యూటీ మేయర్

మచిలీపట్నంటౌన్: ఎడతెరిపి లేని వర్షంతో నగరం నిండు కుండలా మారింది. లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మంగళవారం కూడా పాఠశాలలకు సెలవు ఇచ్చారు. ప్రధాన రహదారులతో పాటు పలు అంతర్గత రోడ్లు నీటితో చెరువులను తలపించాయి. బస్టాండ్ ఆవరణ ముంపుబారిన పడటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కోనేరు సెంటర్ జలమయమైంది. పలు ప్రాంతాల్లో చెట్లు, ఇళ్లు, ప్రహరీలు కూలాయి. పలు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రలకు తరలి వెళ్లారు. సుందరయ్య కాలనీ, వైఎస్సార్ కాలనీల్లో లోతట్టులో ఉన్న గృహాల్లోకి వర్షంనీరు చేరి ఇబ్బందులు పడ్డారు. పలు ప్రధాన డ్రెయిన్లతో పాటు కప్పా డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. డ్రెయిన్‌ల శివారు ప్రాంతాల్లో పూడికలను తొలగించే పనులు నిర్వహించారు. నగరంలోని ఏడు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. నిరాశ్రయులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయా డివిజన్‌ల కార్పొరేటర్‌లు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. 46, 5 డివిజన్‌లలో రెండు చెట్లు రోడ్డుకు అడ్డంగా కూలాయి. 31వ డివిజన్ కల్యాణ నగర్‌లో రేకుల షెడ్డు కొంత భాగం కూలింది. 43వ డివిజన్ బలరామునిపేటలో ప్రహరీ కూలింది. నగరంలోని ముంపు బారిన పడిన లోతట్టు ప్రాంతాల్లో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు, కమిషనర్ జి. చంద్రయ్య, తహసీల్దార్ శ్రీవిద్య పర్యటించి బాధితులకు చెప్పారు.

6,720 ఎకరాల్లో వరి నీట మునక

నాగాయలంక: మండలంలో 6,720ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు మండల వ్యవసాయ అధికారి ఎ.సంజీవరావు తెలిపారు. వర్షం కొనసాగితే ఈ నష్టం మరింత పెరుగుతుందన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మండలంలో పర్యటించి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితలను పరామర్శించారు. గణపేశ్వరం దేవస్థానం సత్రంలో మండల శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా 500మంది బాధితులకు భోజనాలు పెట్టారు.

సముద్రం అల్లకల్లోలం

కోడూరు: బావట్ల వద్ద తుపాను తీరం దాటిన సమయంలో పాలకాయతిప్ప బీచ్ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలో అలలు సుమారు 12 అడుగులు ఎత్తున ఎగిసిపడ్డాయి. 90-100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. అలల ఉధృతికి సముద్రం ఇసుకతిన్నెలు భారీగా కోతకు గురయ్యాయి.

నిందితులపై కేసు నమోదు

పెడన: ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగులు ఈఎంఐలు వసూలు చేసి కంపెనీకి చెల్లించకుండా స్వాహా చేయడంతో పాటు ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పారిపోయిన వారిపై పోలీసులు కేసు నమోదుచేశారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన చెన్నై ప్రాంతంలో ఫైనాన్స్ ఇండియా లిమిటెడ్ సంస్థలో జి. ఆంజనేయులు, పోలగాని రామకృష్ణలు ఉద్యోగులు. వీరు పెడన ప్రాంతానికి చెందిన వారిగా కంపెనీలో చిరునామాలు ఇచ్చారు. కంపెనీ ఫైనాన్స్‌పై ఏడుగురు ఏడు ద్విచక్ర వాహనాలకు సంబంధించి ఈఎంఐలు రూ 97,300 వసూలు చేశారు. వీటిని కంపెనీకి చెల్లించలేదు. కంపెనీ అనుమతులు లేకుండా రూ 4.82 లక్షల విలువ గల ఏడు ద్విచక్ర వాహనాలను వీరు స్వాధీనం చేసుకుని ఉడాయించారు. కంపెనీ ప్రతినిధి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.